RNI No: APTEL /25/A2860

సీమ వార్త
# సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 31 | పేజీలు : 4 | సోమవారం 3 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

## మునిగిపోతున్న తీరప్రాంత నగరాలు..

- శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆసక్తికర విషయాలు
- తీర నగరాలకు సముద్ర మట్టం పెరుగుదలతో పాటు నేల కుంగిపోతుండడం వల్ల ముప్పు
- తీర ప్రాంతంలో ఏటా 6 మి.మీ. సముద్ర మట్టం పెరుగుదల ప్రభావం
- భూగర్భ జలాల అధిక వినియోగం ప్రధాన కారణమని అధ్యయనం
- జకార్తాలో ఏడాదికి 13.7 మి.మీ. మేర నేల కుంగుబాటు
- బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా వంటి దేశాల్లో అధిక ముప్పు
- స్వీడన్, ఫిన్‌లాండ్‌లో మాత్రమే పైకి లేస్తున్న భూమి





## సీజేపీ బలోపేతమే తొలి లక్ష్యం

- ఎన్నికల రాజకీయాల్లోకి కాక్రోచ్ పార్టీ?
- స్పష్టతనిచ్చిన అభిజిత్ దీప్కే
- వాలంటీర్లతో సమీక్ష తర్వాత భవిష్యత్ కార్యాచరణ
- ప్రజల్లో భయం పోవడమే ఉద్యమ అసలు విజయం
- ఎన్నికల రాజకీయాలపై ప్రస్తుతం ఆసక్తి లేదని స్పష్టీకరణ
- ప్రజా ఉద్యమాలే ప్రజాస్వామ్యానికి బలమని అభిప్రాయం
- నిరుద్యోగం, విద్య రాజకీయ అంశాలేనని వ్యాఖ్య



## జగన్ డైరెక్షన్‌లోనే అటవిక చర్యలు..

- రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడింది: మంత్రి పార్థసారథి
- జగన్ అండతో వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్న మంత్రి
- కర్నూలులో దళిత కుటుంబంపై వైసీపీ ఎమ్మెల్యే దాడి అమానుషం
- దళితులు, మహిళలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనం దారుణమంటూ విమర్శలు
- తప్పు చేస్తే సొంత నేతలనూ చంద్రబాబు మందలిస్తారని వెల్లడి
- అరాచక శక్తులను ఉపేక్షించం, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

అమరావతి

రాష్ట్రంలో వైసీపీ నేతలు సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాల వెనుక ఆ పార్టీ అధినేత జగన్ డైరెక్షన్ ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ పెంచి పోషిస్తున్న రౌడీ - మిగతా 3లో

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

- ఇక కరెంట్ స్తంభాలు, తీగలకు గుడ్ బై
- విద్యుత్ లైన్ల మళ్లింపు, రీ-రూటింగ్ పనులను చేపట్టిన విద్యుత్ శాఖ
- భవిష్యత్తులో విద్యుత్ తీగలు బయటకు కనపడని విధంగా చర్యలు
- భూగర్భం ద్వారా విద్యుత్ సరఫరా జరిగేలా అత్యాధునిక సాంకేతికత వినియోగం



అమరావతి

రాజధాని అమరావతి కోర్ క్యాపిటల్‌లో నిర్మాణాలకు అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్ల మళ్లింపు, రీ-రూటింగ్ పనులను విద్యుత్ శాఖ చేపట్టింది. భవిష్యత్తులో విద్యుత్ తీగలు బయటకు కనపడని విధంగా రాజధానిని తీర్చిదిద్దేందుకు పనులను దశల వారీగా చేపట్టేలా ప్రతిపాదన సిద్ధం చేశారు. ప్రస్తుతం కోర్ క్యాపిటల్ ప్రాంతంలో అడ్డుగా ఉన్న 400 కేవీ విద్యుత్ లైన్లను మళ్లించడంతో పాటు కొత్తగా రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.1,979.10 కోట్లతో 18 పనులు చేపట్టారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు 400 కేవీ, 220 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. ప్రధాన నిర్మాణాలకు అవి అడ్డుగా ఉండటంతో వాటిని మళ్లించే పనులను ఏపీ ట్రాన్స్‌కో చేపట్టింది. ప్రతిపాదించిన పనుల్లో సుమారు 27 శాతం పూర్తయ్యాయి. దశల వారీగా మిగతావి పూర్తి చేస్తారు. రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో విద్యుత్ సరఫరా మొత్తం భూగర్భం ద్వారా జరిగేలా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందుకు భారీ డక్ట్‌లు నిర్మిస్తున్నారు. రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ విద్యా సంస్థలు, కీలక భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటన్నింటికీ విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా భూగర్భం - మిగతా 3లో

# సైబర్ నేరాలపై కొత్త వ్యూహం

- గూగుల్, మెటాపై పోలీసుల కఠిన చర్యలు
- సైబర్ నేరాల కట్టడికి సర్వీస్ ప్రొవైడర్లపై పోలీసుల గురి
- ప్లేస్టోర్‌లో నకిలీ యాప్‌లు, నేరాలకు సామాజిక మాధ్యమాలు
- సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆందోళన
- శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు



హైదారాబాద్

దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం తన వ్యూహాన్ని మార్చింది. కేవలం మోసగాళ్లను అరెస్టు చేయడం మాత్రమే కాకుండా, నేరాలకు వేదికలుగా మారుతున్న డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపైనా చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా గూగుల్, మెటా వంటి టెక్ సంస్థలు తమ వేదికల ద్వారా జరుగుతున్న మోసాలను అరికట్టడంలో మరింత బాధ్యత వహించాలని పోలీసులు భావిస్తున్నారు. నకిలీ యాప్‌లు, తప్పుడు పోస్టులు, మార్ఫింగ్ వీడియోలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అడ్డుకునేలా ఈ సంస్థలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఓ ఆందోళన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన నకిలీ వార్తలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు, మెటా ఇండియా అధిపతి అరుణ్ శ్రీనివాస్‌ను నిందితుడిగా చేర్చి నోటీసులు జారీ చేశారు. మెటా నుంచి వచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సైబర్ నేరాల్లో ప్రస్తుతం పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్టాక్ మార్కెట్ - మిగతా 3లో



## జోగినులకు అండగా ప్రభుత్వం

- లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల వేడుకల్లో పాల్గొన్న పొన్నం ప్రభాకర్
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి
- జోగినులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడి

హైదారాబాద్

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక - మిగతా 3లో

## ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు
- నిరుద్యోగుల అంశంలోకాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు
- యూత్ డిక్లరేషన్ హామీలు అమలు కావడం లేదని ఆరోపణ
- పోలీసు నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీత
- రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం
- రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్
- రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై ప్రశ్నలు




హైదారాబాద్

తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'యూత్ డిక్లరేషన్' - మిగతా 3లో

## అయోధ్య ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం..

- తప్పుకున్న ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత
- రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యతల నుంచి వైదొలిగిన భయ్యాజీ జోషి
- విరాళాల దొంగతనం వివాదం నేపథ్యంలో ట్రస్ట్‌లో కీలక మార్పులు
- అనారోగ్య కారణాలు చూపుతూ తప్పుకున్న భయ్యాజీ జోషీ
- ఆర్ఎస్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ నేత జోషి



సోమవారం 3 ఆగస్టు 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## గాయపడ్డ తమ్మునికి... నిమ్మల శ్రీధర్ అండ,దండ.

**టిడిపి కార్యకర్త శివశంకర్ యాదవ్ కు పరామర్శ... ఆర్థిక సాయం అందజేసిన నిమ్మల శ్రీధర్.**



**గోరంట్ల ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల పట్టణంలోని ఒకటవ వార్డు పరిధిలోని 230 వ బూత్ ఇంచార్జ్ టిడిపి కార్యకర్త శివశంకర్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నేపథ్యంలో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోల్డ్ షాప్ యజమాని నిమ్మల శ్రీధర్ తన అనుచరులకు వెళ్లి శివశంకర్ ను పరామర్శించి తన వంతు బాధ్యతగా ఆర్థిక సాయం అందజేసి అండ దండగ నిలిచాడు. ఈ సందర్భంగా వాసవి మహల్ వెనుక ప్రాంతంలో నివాసముండే శివశంకర్ ఇంటి వద్దకు నిమ్మల శ్రీధర్ తోపాటు టిడిపి నేత ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమాశంకర్ ఐటీడీపీ నాయకులు మల్లాపల్లి నరేష్ యాదవ్ తదితరులు శివశంకర్ యాదవును పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకుని తొలగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్మల శ్రీధర్ ధనవంతు బాధ్యతగా వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో కలగేరి గంగిరెడ్డి, కురవ మహేంద్ర, డీలర్లు రమేష్, మల్లేష్, వాటర్ ప్లాంట్ కలీం,త్యాగరాజు, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, దాదు, కురుమాల నరేంద్ర, శంకర తదితరులు పాల్గొన్నారు.

## అనాథగా....అప్పుడే పుట్టిన బిడ్డ..!!

రక్తపు తడి ఆరకనే ముళ్ళ పొదల్లో పసికందు.

అమ్మవారు పల్లి నరసింహస్వామి గుడి వద్ద వదిలేసిన వైనం.

**పెనుగొండ ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.**



పెనుకొండ మండలం కియా పోలీస్ స్టేషన్ వెనుక భాగంలోని మునిమడుగు పంచాయతీ పరిధిలోని నరసింహా ఆలయం సమీపంలో అప్పుడే పుట్టిన ఓ మగ శిశువును ఎవరో అనాథగా వదిలేశారు.సోమవారం ఉదయం శిశువు కేకలు విని అక్కడున్న వారు ఉలిక్కిపడ్డారు. దగ్గరికి వెళ్ళి చూడగా... అప్పుడే పుట్టి..ఇంకా రక్తపు తడి కూడా ఆరని ఓ మగబిడ్డను ఇలా వదిలేసివెళ్లడానికి ఆ తల్లికి చేతులు ఎలా వచ్చాయినంటూ స్థానికులు శాపనార్థాలు పెడుతున్నారు. ఈ ఘటనపై లోతైన విచారణ చేసి, బాధ్యులను గుర్తించి శిక్షించాలని స్థానికులు కోరారు.ఈ ఘటనపై ఐసీడీఎస్ శ్రీ సత్యసాయి జిల్లా పీడీ ప్రమీల స్పందిస్తూ.. శిశువును స్వాధీనం చేసుకొని, అనంతపురంలోని నవజాత శిశు కేంద్రంలో ఉంచి, వైద్య సెలవలు అందించాక... శిశువును శిశుగృహకు తరలిస్తామని వెల్లడించారు.

## స్టూడెంట్స్ భవిష్యత్తు ప్రశ్నార్థకం..,!!

....డీఎస్సీ నియామకాలలో అవకతవకలను నిరసిస్తూ వైసిపి ఆందోళన.

.... డీఎస్సీ ప్రక్రియలో పారదర్శకత లోపించింది... స్వతంత్ర వ్యవస్థతో విచారణ జరపాలి.

.... ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం స్టూడెంట్స్ నిరీక్షణ... ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో తీవ్ర నష్టం.

.... మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ తో నిరసన.

పరిగి ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.





పెనుకొండ నియోజకవర్గం పరిగి మండల కేంద్రంలో డీఎస్సీ నియామకాలలో చోటు చేసుకున్న అవకతవకలను నిరసిస్తూ, నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, టౌన్ హాల్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలలో నెలకొన్న పరిస్థితులు లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సిద్ధమైన అభ్యర్థులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు.డీఎస్సీ ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, అభ్యంతరాలకు ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. వెంటనే స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ నిర్వహించి అర్హులైన ప్రతి అభ్యర్థికి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల హామీలో ప్రకటించిన నిరుద్యోగ భృతి అమలుపై ఇప్పటికీ స్పష్టత లేదని అన్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అనేక పథకాలు నిలిచిపోయాయని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఈ పరిస్థితికి రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాలలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి, అర్హులైన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు అండగా పోరాటం కొనసాగిస్తుందని శ్రీమతి ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.





# సబ్సిడీలో సన్న బియ్యం..!!

.....కొత్తచెరువులో.....ప్రత్యేక విక్రయ కేంద్రం ప్రారంభం.

..... పాల్గొన్న....జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి.

.....మార్కెట్‌లో బియ్యం ధరల నియంత్రణే లక్ష్యంగా 15 మండలాల్లో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు ప్రారంభం

.....స్టీమ్ రైస్ బిపిటి కిలో ?52, ముడిబియ్యం బిపిటి ?50లకే లభ్యం

....ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

**కొత్తచెరువు,ఆగస్టు,3: సీమ వార్త సాయంత్రం.**



కొత్తచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి మరియు స్థానిక తహసిల్దార్‌లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకైన బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు మరియు సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 15 ముఖ్య మండలాల్లో 15 ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఈరోజు (ఆగస్టు 03) అధికారికంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.మార్కెట్ వ్యాపారుల కృత్రిమ కొరత, ధరల పెరుగుదలను అరికట్టేందుకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత రాయితీ ధరలకు సరఫరా చేస్తోందని అధికారులు తెలిపారు. సూపర్‌ఫైన్ రకం స్టీమ్ రైస్ బిపిటి కిలో రూ. 52/-ముడిబియ్యం : కిలో రూ. 50/- ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు సాధారణ స్థితికి వచ్చేవరకు ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలు నిరంతరం పనిచేస్తాయని స్పష్టం చేశారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు సబ్సిడీ ధరలకే బియ్యం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రాల ద్వారా బియ్యాన్ని కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు అందుబాటులో ఉన్న 15 మండలాలు:లి రోద్దం,బత్తలపల్లి,సి.కే. పల్లి,గాండ్లపెంట,గోరంట్ల, హిందూపూర్,కదిరి,కొత్తచెరువు, మదకశిర, ముదిగుబ్బ పెనుగొండ పుట్టపర్తి తాడిమర్రి ధర్మవరం లేపాక్షి ప్రాంతాల్లో విక్రయాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# సంక్షోభంలో సీమ రైతులు..!!

.....రాయలసీమ 8 జిల్లాలను వెంటనే కరువు జిల్లాలుగా ప్రకటించాలి.

.... సీమ రైతులు వలసలకు సిద్ధమవుతున్నారు... నివారణ చర్యలు చేపట్టండి.

....కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి, బీసీ నేత శ్రీరాములు డిమాండ్ -

.... రైతులకు పంట నష్ట పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలి.

.... పుట్టపర్తి జిల్లా కేంద్రంలో... రైతులతో ర్యాలీ.

.... కలెక్టర్ శ్యాంప్రసాద్ కు వినతిపత్రం అందజేసిన వైనం.











**పుట్టపర్తి, ఆగస్టు 3 (సీమవార్త సాయంకాలం బ్యూరో) :-**

గత కొంతకాలంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రాయలసీమ జిల్లాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాయలసీమ 8 జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కరువు జిల్లాలుగా వెంటనే ప్రకటించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు వి.పి. నారాయణస్వామి రాయల్ మరియు రాయలసీమ బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తిలోని ప్రశాంతి రైల్వే స్టేషన్ పక్కన ఉన్న రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మామిళ్ళకుంట క్రాస్ వద్ద నుండి రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నారాయణస్వామి రాయల్ మాట్లాడుతూ, సీఎం నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2026 నుండి రాయలసీమ 8 జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో అరకొర వర్షాల వల్ల వరి, పత్తి, ఉలవ, కంది పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. అనంతరం కొట్టాల శ్రీరాములు మాట్లాడుతూ, ముఖ్యంగా శ్రీ సత్య సాయి జిల్లాలో వర్షపాతం చాలా తక్కువగా ఉండటంతో వేరుశనగ, కంది, వరి, ఉలవ పంటలు పూర్తిగా నష్టపోయాయని అన్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వేరే రాష్ట్రాలకు వలసలు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, మదనపల్లి, చిత్తూరు, తిరుపతి జిల్లాలు మరియు నెల్లూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రైతులకు పంట నష్టపరిహారాన్ని పూర్తి స్థాయిలో వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని కాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సెగినేని పోతులూరయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొట్లాల శ్రీరాములు, గ్రేటర్ రాయలసీమ అధ్యక్షులు పోతులూరయ్య, కృష్ణయ్య, బాలరాజు, నాగరాజు, ఈశ్వరమ్మ, గంగాద్రి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

సోమవారం
3 ఆగస్టు 2026

## జోగినులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

-మొదటిపేజీ తరువాయి

గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు. జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## సీజేపీ బలోపేతమే తొలి లక్ష్యం

ఢిల్లీ విద్యార్థుల ఆందోళన తర్వాత తమ తొలి లక్ష్యం సంస్థను మరింత బలోపేతం చేయడమేనని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే చెప్పారు. ఉద్యమం ఆరంభంలో తమతో 10 నుంచి 20 మంది మాత్రమే ఉన్నారని, ఇప్పుడు వాలంటీర్ల సంఖ్య 300 దాటిందని తెలిపారు. ముందుగా వారందరితో సమావేశమై ఉద్యమంలో జరిగిన లోపాలు, మెరుగుపర్చాల్సిన అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. ఆ తర్వాతే సంస్థ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే తమ ఉద్యమం అతిపెద్ద విజయం కాదని దీప్కే స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో పెరగడం, తమ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చి పోరాడే స్ఫూర్తి రావడమే నిజమైన విజయమని అన్నారు. గత 10 నుంచి 12 ఏళ్లుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పోలీసు చర్యలు, కేసులు, జైలు భయం ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపిస్తే ప్రభుత్వం స్పందించాలని దీప్కే అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని కోరినప్పుడు ఆ డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడినప్పుడు ప్రజా ఒత్తిడి తీసుకొచ్చే ఉద్యమాలే అవసరమని చెప్పారు. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలంలో కూడా ప్రజా ఉద్యమాలే కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. నిరుద్యోగం, విద్య వంటి అంశాలు కూడా రాజకీయ నిర్ణయాలతో ముడిపడి ఉంటాయని దీప్కే అన్నారు. పార్లమెంట్‌లో తీసుకునే నిర్ణయాల ప్రభావం ప్రజలు కొనుగోలు చేసే నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ విద్యకు సంబంధించిన సమస్య తలెత్తినా తమ సంస్థ విద్యార్థులకు అండగా ఉంటుందని దీప్కే చెప్పారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థ సవాళ్లు ఎదుర్కొంటోందని, విద్యార్థుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. అలాంటి ప్రతి సమస్యపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఎవరి సాయం లేకుండా
## ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?

-మొదటిపేజీ తరువాయి

పేరిట కాంగ్రెస్ నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని విమర్శించారు. ఉద్యోగాలు రాక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరుద్యోగులు అడిగితే సీఎం రేవంత్ రెడ్డి “ఎండ్రిన్ తాగి చావండి” అన్నట్లుగా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను ‘క్రిమినల్ వేస్ట్’ అని సీఎం రేవంత్ సంబోధించడం బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపిస్తూ “అసలైన క్రిమినల్ వేస్ట్ ఆయనే” అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతితో తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణ నిరుద్యోగుల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్హతపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఆయన అసలు ఏం చదివారో కూడా అనుమానమేనని అన్నారు. ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్‌ను నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూకైనా హాజరయ్యారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల కష్టాలు రేవంత్‌కు ఏమాత్రం తెలియవని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా, కేంద్ర నిధుల కొరత ఉన్నా రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తుందో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాలపై కొత్త వ్యూహం

-మొదటిపేజీ తరువాయి



పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయలు కాజేస్తున్న ఘటనలు అధికంగా నమోదవుతున్నాయి. మోసగాళ్లు నకిలీ పెట్టుబడి యాప్‌లను రూపొందించి గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచుతున్నారని పోలీసులు గుర్తించారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నలుగురు బాధితులు ప్లే స్టోర్ నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేసి లక్షల రూపాయలు కోల్పోయినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో గూగుల్ భారత విభాగ అధిపతిపై నాలుగు వేర్వేరు కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు.

### సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆందోళన

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికలను నేరస్థులు సైబర్ మోసాలు, డ్రగ్స్ స్మగ్లింగ్, నకిలీ ఖాతాలు, సిమ్ కార్డుల అక్రమ లావాదేవీల కోసం వినియోగిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో అవసరమైన సమాచారం కోరినప్పటికీ, కొన్ని సందర్భాల్లో సోషల్ మీడియా సంస్థల నుంచి సరైన సహకారం అందడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో విచారణ ఆలస్యమవుతోందని వారు అంటున్నారు.

### బాలికలను కాపాడిన పోలీసులు

రాజధానిలో ఇటీవల ఇంటి నుంచి అదృశ్యమైన 12 మంది బాలికలను పోలీసులు సురక్షితంగా గుర్తించి కుటుంబాలకు అప్పగించారు. వీరంతా ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన అపరిచితుల మాటలు నమ్మి వెళ్లిపోయినట్లు దర్యాప్తులో తేలింది. ఈ ఘటన సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది.

### శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

అభ్యంతరకర పోస్టులు, ఏఐ సాయంతో రూపొందించిన మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ముఖ్యంగా నిరసనలు, పండుగలు, ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వ్యాపించే తప్పుడు సమాచారంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని అధికారులు హెచ్చరిస్తున్నారు. నోటీసులకు సంస్థలు ఇచ్చే స్పందనను పరిశీలించి, అవసరమైతే మరింత కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నారు. సైబర్ నేరాల నియంత్రణలో టెక్ సంస్థల బాధ్యతను మరింత పెంచే దిశగా పోలీసుల తాజా వ్యూహం కీలకంగా మారుతోంది.

## అయోధ్య ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం..

అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేశ్ భయ్యాజీ జోషి ట్రస్ట్ సంరక్షకుడి బాధ్యతల నుంచి వైదొలగారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, తాను అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు 78 ఏళ్ల జోషి స్పష్టం చేశారు. 2026 జూన్ లో వెలుగులోకి వచ్చిన విరాళాల అక్రమాల ఆరోపణలతో ట్రస్ట్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నగదు కానుకల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి దాదాపు రూ. 80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. భయ్యాజీ జోషి 2009 నుంచి 2021 వరకు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. గతంలో రామజన్మభూమికి సంబంధించిన భూముల కొనుగోళ్లలో అవకతవకల ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన్ను ట్రస్ట్ పాట్రన్‌గా నియమించారు. ఆయన పాత్ర ప్రధానంగా తెరవెనుక సలహాలకే పరిమితమైంది. విరాళాల వివాదం పార్లమెంటులోనూ అధికార, విపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీయగా, పారదర్శక విచారణకు సహకరిస్తామని, విరాళాల నిర్వహణలో సంస్కరణలు చేపడుతున్నామని ట్రస్ట్ ప్రకటించింది.

## మునిగిపోతున్న తీరప్రాంత నగరాలు..

సినిమాల్లో సముద్రం నగరాలను మింగేసే దృశ్యాలు చూస్తుంటాం. అవి కల్పిత కథలుగా అనిపించినా, ఇప్పుడు అదే దిశగా పరిస్థితులు మారుతున్నాయని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులతో సముద్ర మట్టం పెరగడం ఒక కారణమైతే, తీర ప్రాంతాల్లో నేల క్రమంగా కుంగిపోవడం మరో పెద్ద ముప్పుగా మారిందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ రెండు కారణాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ‘టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్’ (టీయూఎం), టులేన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు సగటున ఏడాదికి 6 మిల్లీమీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధన తెలిపింది. ఇది ప్రపంచ సగటు కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మందికి పైగా ప్రజలు తక్కువ ఎత్తులో ఉన్న తీర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో సముద్ర మట్టం పెరగడమే కాదు, నేల కూడా క్రమంగా దిగజారడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోందని శాస్త్రవేత్తలు వివరించారు. తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలను అధికంగా తోడేయడం, చమురు, సహజవాయువు వెలికితీత, నదీ డెల్టాల్లోని మృదువైన నేల కుంగిపోవడం, భారీ భవనాల బరువు వంటి కారణాలతో భూమి దిగజారుతోందని అధ్యయనం వెల్లడించింది. దీనికి తోడు భూకంప ఫలకాల్లో కదలికలు, మంచు యుగం తర్వాత భూపొరలో జరుగుతున్న సహజ మార్పులు కూడా ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది. కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నైజీరియా, ఈజిప్ట్, చైనా, ఇండోనేషియా తీర ప్రాంతాల్లో ఏడాదికి 7 నుంచి 10 మిల్లీమీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల నమోదవుతోంది. అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీలో ఈ పెరుగుదల 4 నుంచి 5 మిల్లీమీటర్ల మధ్య ఉంది. ఇండోనేషియా రాజధాని జకార్తా అత్యంత ప్రమాదంలో ఉన్న నగరంగా అధ్యయనం పేర్కొంది. అక్కడ సగటున ఏడాదికి 13.7 మిల్లీమీటర్ల మేర నేల కుంగిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ వేగం 42 మిల్లీమీటర్ల వరకు నమోదైంది. చైనాలోని టియాంజిన్, థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్, నైజీరియాలోని లాగోస్, ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా కూడా ప్రమాదకర జాబితాలో ఉన్నాయి. అయితే అన్ని తీర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి లేదని పరిశోధకులు తెలిపారు. స్వీడన్, ఫిన్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూమి పైకి లేస్తుండటంతో అక్కడ సముద్ర మట్టం ప్రభావం తక్కువగా కనిపిస్తోందని వివరించారు. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడం ద్వారా నేల కుంగిపోవడాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచించారు. ఒకప్పుడు ఏడాదికి 10 సెంటీమీటర్లకుపైగా కుంగిపోయిన టోక్యోలో ప్రభుత్వ చర్యలతో పరిస్థితి మెరుగుపడిందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ఇతర దేశాలు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## జగన్ డైరెక్షన్ లోనే అటవిక చర్యలు..

-మొదటిపేజీ తరువాయి

మూకల ఆటవిక చర్యలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడిందని ఆయన హెచ్చరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలపై విరుచుకుపడ్డారు. “ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుకు బాటలు వేస్తుంటే, మరోవైపు ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేని వైసీపీ.. యువతను గంజాయి, రౌడీయిజం వైపు మళ్లించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. కులాల మధ్య చిచ్చుపెట్టడం, విధ్వంసం సృష్టించడమే వైసీపీలో కొనసాగడానికి అర్హతగా మారింది. తప్పు చేసి దొరికిపోయాక, ‘రాజకీయ కక్ష సాధింపు’ అంటూ సోషల్ మీడియాలో ఏడవడం ఆ పార్టీకి అలవాటైంది” అని పార్థసారథి ఎద్దేవా చేశారు. కర్నూలు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఒక దళిత కుటుంబంపై బరిసెలు, మారణాయుధాలతో దాడికి పాల్పడడం హేయమైన చర్య అని మంత్రి తీవ్రంగా ఖండించారు. “ఒక దళిత సోదరి ఇంట్లోకి చొరబడి, ఆమె బట్టలు చించి అవమానించి, పైగా బాధితులే బట్టలు చించుకున్నారని సిగ్గులేకుండా ప్రచారం చేయడం వైసీపీ నీచ రాజకీయాలకు పరాకాష్ఠ. శ్రీకాకుళంలో మహిళా సీఐని అవమానించిన ఘటన నుంచి నేటి వరకు దళితులు, మహిళలపై వైసీపీ నేతల దాడులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 ఏళ్లు దాటిన గొర్రెల కాపరి మరణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు, పేదల ప్రాణాలంటే ఆయనకున్న చులకన భావాన్ని, విపరీత మనస్తత్వాన్ని బయటపెట్టాయని అన్నారు. తమ పార్టీ నేతలు తప్పు చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు మందలించి సరైన మార్గంలో పెడతారని, కానీ జగన్ మాత్రం తన పార్టీ నేతల అరాచకాలకు అండగా నిలుస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తున్నారని పార్థసారథి విమర్శించారు. “నా ఎస్సీ, నా బీసీ, నా మైనారిటీ అని ఎన్నికల ముందు నాటకాలు ఆడిన జగన్, ఇప్పుడు అదే దళితులు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదు?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని, దోషులకు కఠిన శిక్షలు తప్పవని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ఇటువంటి అరాచక శక్తులను కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

-మొదటిపేజీ తరువాయి

ద్వారా విద్యుత్ లైన్లు మొత్తం వెళ్లేలా డిజైన్లు రూపొందించారు. అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు. తాళ్లాయిపాలెం సబ్‌స్టేషన్ నుంచి భారీ డక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు 220 కేవీ విద్యుత్ సరఫరాకు వీలుగా సుమారు 24 లైన్లు వెళ్లే అవకాశముంది. 55 కి.మీ.మేర భూగర్భం నుంచే విద్యుత్ తీగలు తీసుకెళు న్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా కోసం వినియోగిస్తున్న లైన్లు, స్తంభాలు, తీగలను దశల వారీగా తొలగిస్తారు. రాజధాని ప్రాంతం మొత్తానికి 33 కేవీ/415 వోల్టుల లైన్లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో భవిష్యత్తులో రోడ్లకు అడ్డంగా విద్యుత్ తీగలు వెళ్లే అవకాశం ఉండదు. తుళ్లూరు, తాడేపల్లి, లింగాయపాలెం, నేలపాడు ప్రాంతాల్లో 220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లతో (జీఐఎస్) విద్యుత్ నెట్‌వర్క్‌ను అనుసంధానించనున్నారు. ఇప్పటికే నేలపాడు, లింగాయపాలెం వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. తర్వాతి దశలో తుళ్లూరు సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించనున్నారు.

## డీఎస్సీలో జరిగిన అక్రమాలపై
## నిరాహార దీక్ష పై రౌండ్ టేబుల్ సమావేశం



**మడకశిర ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం** ఈనెల ఆరవ తేదీ నుండి 9వ తేదీ వరకు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు గురించి వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ ఈరలకప్ప స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైసి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులు మండల కన్వీనర్ శ్రీరాములు పట్టణ కన్వీనర్ ఓం కుమార్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రామ్ రెడ్డి ,పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి ,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహ మూర్తి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తిప్పేస్వామి, పట్టణ ఉపాధ్యక్షులు గోపి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి రంగనాథ్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి లక్ష్మీనారాయణ,బూత్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు సికందర్,ప్రచార విభాగం అధ్యక్షులు రఘునందన్, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు హరి , పట్టణ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, సురంగాల నాగరాజు, బ్రెడ్ల నాగరాజు,చంద్ర,మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు గౌడ్, పంచాయతీ అధ్యక్షులు కిషోర్ , పంచాయతీ రైతు విభాగంఅధ్యక్షులు లక్ష్మీనారాయణ గౌడ్ ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## అమలుకాన్ని స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్ర
## ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం


### డిప్యూటీ ఎంపీడీవో కు సిపిఐ వినతి



**ఓబులదేవరచెరువు (ఆగస్టు4)సీమ వార్త: సాయంత్రం.** మండల కేంద్రమైన ఓడి చెరువు పరిసర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం అమలు కావడం లేదని ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయిందని వెంటనే వీటిని తొలగించే చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ నాయకులు డిప్యూటీ మండల పరిషత్ అధికారి సోమశేఖర్ కు వినతి పత్రం ఇచ్చారు.సిపిఐ మండల కన్వీనర్ చలపతి నాయుడు నాయకులు రత్నాబాయి, రవికుమార్,సుధాకర్, రమణప్ప,వీరయ్య తదితర నాయకులు సోమవారం డిప్యూటీ తాసిల్దార్ కు సమస్యను వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కస్తూరిబా స్కూల్, ప్రభుత్వం బియ్యం గోడౌన్ చుట్టుపక్కల పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారిందన్నారు.అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో కూడా చెత్త పేరుకు పోయిందన్నారు. దింతోపాటు ఇనగలూరు గ్రామంలో చెత్త వేసేందుకు కుండీలు ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యాయని అయితే ఈ కుండీలను నిరుపయోగంగా మార్చారన్నారు. అంతేగాక ప్రభుత్వం నుంచి వచ్చిన కుండీలు గ్రామపంచాయతీ కార్యదర్శి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు.వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. వెంటనే వీటిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ లక్ష్యం అమలు జరిగేలా చూడాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు,కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా టెట్ పరీక్షలు నిర్వహించాలి.

### ...జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్



**అనంతపురం, ఆగస్టు 3: సీమ వార్త సాయంత్రం.** జిల్లా వ్యాప్తంగా ఈనెల 5 నుండి 16 వరకు జరిగే ఎ .పి .టెట్ పరీక్షల ను పకడ్బందీగా నిర్వహించే విధంగా ఆయాశాఖల అధికారు లుచర్యలు తీసుకోవాలని జిల్లాజాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ సమావేశ భవన్ లో ఆంధ్రప్రదేశ్ టెట్ పరీక్షల నిర్వహణపై ఇంచార్జ్ డిఇఓ శ్రీనివాసరావు తో కలిసి సంబంధితశాఖఅధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలుసూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 18191 మందిదాకాఅభ్యర్థులు,128 స్క్రైబ్స్ ఈ టెట్ పరీక్షలకు హాజరవుతున్నారని మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అలాగే రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల సమయం వరకు టెట్ కంప్యూటర్ బేస్డ్ విధానంలో టెస్ట్ పరీక్షలు 11 రోజులపాటు ఉంటాయనిపేర్కొన్నారు. పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. మరి ముఖ్యంగా నిర్దేశించిన సమయంలోగా అభ్యర్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్లను వెంట తీసుకొని పరీక్ష కేంద్రాలకు హాజరుకావాల్సిందిగా సూచించారు. ఆర్టీసీ సంస్థ వారి ద్వారా అవసరమైన మేరకు ఆయా ప్రాంతాలకు సంబంధించి బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందులో6మందిడిపార్ట్మెంట్ ఆఫీసర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్ ను నియమిం చినట్లు తెలిపారు. జిల్లాలోని ఆరు కేంద్రాలు అయినబుక్కరాయసముద్రం మండలం రోటరీ పురం వద్దనున్న శ్రీనివాస రామా నుజన్ కళాశాల, గుత్తి గేట్స్, అనంతపురం పి వి కే కే రుద్రంపేట, తాడిపత్రి సి.వి రామన్, నేషనల్ కౌన్సిల్ చర్చ్ సోషల్ యాక్షన్ ప్రసన్నాయపల్లి, ఎస్ కే యువద్దఉన్నఅనంత లక్ష్మికళాశాలలోకంప్యూట ర్ ఆధారితపరీక్షలుజరుగు తాయన్నారు.ల ముఖ్యంగాపరీక్షసమయంలో నిరంతర విద్యుత్ సరఫరా త్రాగునీటి వసతి వైద్య శిబిరం పారిశుద్ధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల నిసూచించారు. అలాగే వైద్య ఆరోగ్య పర సిబ్బంది ఏర్పాటు, వికలాంగ అభ్యర్థులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు, తదితర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో ఏఎస్పీ అడ్మిన్ నాగభూషణం , డి ఆర్ ఓ మాలోల, ఇంచార్జ్ శ్రీనివాసరావు , ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఇ శేషాద్రి, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు డిపిఓ నాగరాజు నాయుడు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత అడ్వకేట్....కాలర్ పట్టుకున్న కాఖీ కీ కఠినంగా శిక్షించాలి.






**హిందూపురం సిఐని సస్పెండ్ చేయాలంటూ గోరంట్లలో దళిత సంఘాల ఆందోళన.**

**అంబేద్కర్ ముందు నిరసన, పట్టణంలో ర్యాలీ, తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా.**

**గోరంట్ల ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.** దళితుల పక్షాన వారి అభివృద్ధి కోసం నిరంతరం న్యాయపోరాటం చేస్తున్న దళిత బిడ్డ హైకోర్టు అడ్వకేట్, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకులు శివరామకృష్ణ పై హిందూపురం సిఐ దురుసుగా ప్రవర్తించారని ఒక రాష్ట్ర హైకోర్టు జడ్జి అని కూడా చూడకుండా కాలర్ పట్టుకుని అవమానించాడని ఆరోపిస్తూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ గోరంట్ల మండలం ఎస్సీ ఎస్టీ నాయకులు, దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా దళిత జేఏసీ నాయకులు కే ఎన్ బాబు, ఓబుల్ కుమార్, ఎరుకల సంఘం రాష్ట్ర నేత, జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమాశంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు వానవోలు నారాయణ, మందలపల్లి గంగన్న, విజయ్ కుమార్, ఎం ఈ ఎఫ్ నాయకులు ఓబులేసు తదితరులు ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద బ్యానర్లు జెండాలు చేత పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ మధు నాయక్ కు అందజేశారు. దీనిపై తాసిల్దార్ స్పందిస్తూ మీరు అందించిన ఈ నీతి పత్రాన్ని ఉన్నతాధికారులకు వెంటనే పంపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆందోళన చేస్తున్న నాయకులు మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం హిందూపురం పట్టణ సీఐ దళిత హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణపై తురుసుగా, అవమానకరంగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సీఐపై శాఖపరమైన విచారణ చేపట్టాలని, అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలగేరి ఓబులేసు, తిప్పయ్య, గంగప్ప, రమణయ్య, నరసింహులు, రమణ,వానవోలు చలపతి, చంటి, లక్ష్మన్న, గంగాదేవి పల్లి నరసింహులు, దత్తాత్రేయ, రామకృష్ణ గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**సోమందేపల్లి ఆగస్టు 3 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని సవితమ్మ పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన చోటుచేసుకుంది. ఉదయం 11 గంటల 30 నిమిషాలు సమయంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం డీకొట్టి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. వ్యక్తి వివరాలు తెలిస్తే సోమందేపల్లి పోలీస్ స్టేషన్ ను సంప్రదించి సమాచారం అందించాలని ఎస్ఐ సుధాకర్ యాదవ్ కోరారు.

## శ్రీ సోమవతి అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు.

**....రవి శంకర్ ని సన్మానించిన ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు.**



**ఓడి చెఱువు ఆగస్టు 3: సీమ వార్త సాయంత్రం.** మండలం లోని దాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో శ్రీ సోమవతి నది ఒడ్డున శ్రీ సోమవతి అక్కదేవతల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సమీప బంధువు రవిశంకర్ కి ఆలయ పూజారి ఆలయ కమిటీ సభ్యులు శాలవా కప్పి, పూలమాలవేసిస్వాగతం పలికరు. ఆనంతరం అమ్మవారి ప్రత్యేక పూజలు పాల్గొని,తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద్ అందజేసి అన్నదాన కార్యక్రమం అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ,భక్తులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బూడిదగడ్డ పల్లి లో రూ, 64.87 లక్షల ఖర్చుతో నీటి ట్యాంకు.

**మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా భూమి పూజ.**



**గోరంట్ల ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.** నార్సింపల్లి పంచాయతీ పరిధిలోని బూడిదగడ్డ పల్లి గ్రామం నందు ఓవర్ హెడ్ ట్యాంక్ రూ,64,87 లక్షల అంచనా వ్యయంతో గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్,5 మ్యాన్ కమిటీ మెంబర్ గంగాధర్,గోరంట్ల టౌన్ 6 మ్యాన్ కమిటీ సభ్యులు, నిమ్మల శ్రీధర్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి,బీజేపీ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ,మేధారశ్రీనివాసులు,మాజీ సర్పంచ్ ఉత్తమరెడ్డి,మిలిటరి నరసింహప్ప, శివప్ప, రాజారెడ్డి, దేవరాజ్, చంద్రశేఖర్,నాగభూషణం, జ గంగాధర్,డీలర్ నాగభూషణం,గంగధర్, నందమోహన్ రెడ్డి, డీలర్ శ్రీనివాసులు, రామచంద్ర,మునే ప్ప, గంగిరెడ్డి,గంగాధర్, నూరమహమ్మద్,శ్రీశైలం శ్రీనివాసులు,కూటమి నాయకులు,కార్యకర్తలులి పాల్గొన్నారు.

## " బెస్త" లకు "తొట్ల" తోడు...

## కళ్యాణ మండపానికి సాయం.

**....రూ, 20 వేలు ఆర్థిక సాయం అందజేసిన జనసేన నేత తోట్ల గంగాధర్.**



**పుట్టపర్తి ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.** పుట్టపర్తి జిల్లా కేంద్రంలో నిర్మించబోవు బెస్త కళ్యాణ మండప నిర్మాణానికి తన వంతు సాయంగా జనసేన పార్టీ నేత తొట్ల గంగాధర్ ఆర్థిక సాయం అందజేసి ఇతర సామాజిక వర్గాలపై తనకున్న ఆప్యాయతను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పుట్టపర్తి పట్టణంలో బెస్త కులస్తుల కళ్యాణ మండప నిర్మాణానికి ధనవంతుగా రూ, 20 వేల నగదు సాయాన్ని అందజేసి వారి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, జ్యోతి కేశవ, సాయిరాం, సూర్యవంశం రవి, జ్యోతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివరామకృష్ణ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలి.

**హిందూపురం వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని. బీఎస్పీ డిమాండ్ .**



**మడకశిర ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం** బహుజన్ సమాజ్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో. హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్య వేదిక నాయకుడు శివరామకృష్ణ పై దురుసుగా ప్రవర్తించిన హిందూపురం వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడును సస్పెండ్ చేయాలని (బీఎస్పీ)బహుజన్ సమాజ్ పార్టీ మడకశిర నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం మడకశిర పట్టణ తాసిల్దార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మడకశిర నియోజకవర్గ ఇన్చార్జ్ హిందీవర్ మాట్లాడుతూ .ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారులు చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యవహరించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. శివరామకృష్ణపై జరిగిన ఘటన కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదని, దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, సీఐ రాజగోపాల్ నాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎం. ఆదినారాయణ నియోజకవర్గ కార్యదర్శి టి .చందు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బి. రవి బహుజన నాయకుడు ఉగ్రప్ప. శంకరప్ప. నరసింహులు .శివన్న. రాజు. సమర్థ తదితరులు పాల్గొన్నారు

## గాయపడ్డ బూత్ కన్వీనర్ కు ....టిడిపి నేతల సాయం

**శివ శంకర్ యాదవ్ ను.....పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన వైనం.**



**గోరంట్ల ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల పట్టణంలోని ఒకటవ వార్డు పరిధిలోని 230 వ బూత్ ఇంచార్జ్ టిడిపి కార్యకర్త శివశంకర్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నేపథ్యంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ వార్డ్ మెంబర్ ఆగిశం నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, గిరిధర్ గౌడ్, డీలర్ అజంతుల్లా, కురుమాల జయరాం తదితరులు టిడిపి బూత్ కన్వీనర్ శివ శంకర్ యాదవ్ ను ఆయన నివాసంలో పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివశంకర్ త్వరగా కోలుకోవాలని పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీధర్ తోపాటు టిడిపి నేత ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమాశంకర్ ఐటీడీపీ నాయకులు మల్లాపల్లి నరేష్ యాదవ్, కలగేరి గంగిరెడ్డి, కురవ మహేంద్ర, డీలర్లు రమేష్, మల్లేష్, వాటర్ ప్లాంట్ కలీం,త్యాగరాజు, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, దాదు, కురుమాల నరేంద్ర, శంకర తదితరులు పాల్గొన్నారు.

## నేతన్న సేవ 25 వేలు బాడుగ ఇళ్లలో ఉన్న వారికి అమలు చేయాలని వినతి



**సోమందేపల్లి ఆగస్టు 3 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మండల సమితి కౌన్సిల్ సభ్యులు శీలా నారాయణస్వామి ఆధ్వర్యంలో అద్దె ఇళ్లలో ఉంటున్న చేనేత కార్మికులతో కలిసి తహసిల్దార్ మారుతీ ప్రసాద్, ఎంపీడీవో వెంకటలక్ష్మి లకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో అనేకమంది కులాల మతాల అతీతంగా ప్రజల ప్రధాన వృత్తి చేనేత కార్మికులు జీవనోపాధి కొనసాగిస్తున్నారు. అటువంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన సేవ పథకానికి విద్యుత్ బిల్లు ప్రామాణికంగా తీసుకోవడం వలన అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి నేతన్న సేవలో అర్హులుగా తీసుకోవాలని అదేవిధంగా ఎస్సీ ఎస్టీ చేనేత కార్మికులకు సంబంధించి జీరో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వారికి కూడా నూతన సేవలో అర్హులుగా చేర్చి 25వేల రూపాయలు వారి ఖాతాలోకి జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందప్ప నరసింహులు చౌడప్ప ప్రకాష్ రమణ ఆంజనేయులు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధిపై డోర్ టు డోర్ కార్యక్రమం





**మడకశిర ఆగస్టు 3 సీమ వార్త సాయంత్రం** శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు , మాజీ శాసన మండలి సభ్యులు, రాష్ట్ర టి.డి.పి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాలు మేరకు రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి సంక్షేమం పేరిట డోర్ టు డోర్ కార్యక్రమం సోమవారం మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామంలో లో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసిన ఇచ్చిన సంక్షేమ అభివృద్ధి ప్రజలు తెలియజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిన కార్పొరేషన్ చెర్మన్ లక్ష్మీ నారాయణ , క్లస్టర్ కో కన్వీనర్ గుండుమల చంద్రప్ప , మండల పార్టీ అధ్యక్షులు కల్లుమర్రి నాగరాజు ,సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా , కంబారపల్లి శ్రీనివాసులు, కస్టర్ కన్వీనర్ మురళి బాబు, కదిరేపల్లి పంచాయతీ అధ్యక్షులు డి పాండురంగప్ప, శ్రీరామప్ప, నాగేంద్ర యూనిట్,బూత్ కన్వీనర్ ఫీల్డ్ అసిస్టెంట్ డీలర్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881